




## (గత సంచిక తరువాయి)

**నేను కథ రాస్తానని** రెడ్డిగారిని అడిగాను. ఆయన వెంటనే అడివి బాపిరాజుగారి 'వసుబాలరెడ్డి' చదవమన్నారు. ఆయన మనస్సులో ఇదివరకే ఆ కథ మీద ఏదో అవగాహన ఉండి ఉండాలి. 'వసుబాలరెడ్డి' చదివి నిర్ఘాంతపోయాను. అద్భుతమయిన కథ. 1960 ప్రాంతాలలో రెడ్డిగారి దృష్టిని ఆకర్షించడంలో ఆశ్చర్యం లేదు. ఒక మహారాజు సామ్రాజ్యంలో 'వేగు' (SPY) పనికిగాను పుట్టినప్పటినుంచీ ఒక అమ్మాయిని తర్ఫీదు చేస్తారు. ఆమె పెరిగి వయస్సొచ్చాక – సామ్రాజ్యం శ్రేయస్సు దృష్ట్యా ఒక యువకునికి భార్యగా నటించాలి. ఈ ఒక్క 'మలుపు' చాలు అద్భుతమైన స్క్రీన్‌ప్లేని సిద్ధం చెయ్యడానికి. దీనికి చారిత్రకమయిన నేపథ్యం, రెడ్డిగారి కళాత్మకమయిన దృష్టి కలిస్తే – తప్పనిసరిగా మరొక "మల్లీశ్వరి" అయే అవకాశాలున్నాయి సందేహం లేదు. మద్రాసు చేరాక నన్ను వాహినీ స్టూడియోకి, విజయాగార్డెన్‌కీ తీసుకెళ్ళారు. వాటిని చూడడం అదే మొదటిసారి. అక్కడే వారి సోదరులు బి.నాగిరెడ్డిగారిని పరిచయం చేశారు.

ఆ స్థలంతో ముందు ముందు నాకు నాలుగున్నర దశాబ్దాల చరిత్ర ముడిపడి ఉందని అప్పటికి తెలీదు. నవల చదివాక శని, ఆదివారాలు మద్రాసు వచ్చి కథా చర్చలు కొనసాగించాలని నిర్ణయించుకున్నాం. వారాంతాలలో చిత్తూరు నుంచి మద్రాసు బస్సులో వెళ్ళేవాడిని. వారింట్లో ఫలహారం చేసి ఆఫీసుకు వచ్చేవారం. మధ్యాహ్నం వరకూ చర్చ. వాహినీ కారులో పాండీ బజారు భోజనానికి వచ్చేవాడిని. పాండీ బజారు నారాయణ కేఫ్ దగ్గర తెలుగు నటుల గుంపు ఉండేది. ఆ గుంపుకి సి.ఎస్.ఆర్.గారు అధ్యక్షులు. వాహినీ కారు వారికి గుర్తు. వాళ్ళు ఆశ్చర్యంగా చూసేవారు. నేను గర్వంగా కారు ఎక్కేవాడిని. సాయంకాలం సరికొత్త వందరూపాయల నోటు కవరులో పెట్టి యిచ్చేవారు. అది నా నెలజీతం. ఇలా కొన్ని వారాలు గడిచాయి. ఓసారి వారి ఒకే ఒక అమ్మాయికి జబ్బు చేసింది. రెడ్డిగారు మానసికంగా చాలా క్రుంగిపోయారు. ఓ వారం మద్రాసు వచ్చారు. "రెడ్డిగారు ఏమీ అనుకోవద్దని చెప్పారు" అంటూ బోయ్ కవరు అందించాడు. చాలా వారాలు గడిచాయి. అమ్మాయి కన్ను మూసింది. రెడ్డిగారు ఆర్ద్రంగా ఉత్తరం రాశారు. అప్పట్నుంచీ ఆయన కన్ను మూసేవరకూ ఓ

హార్దికమయిన స్నేహం మా యిద్దరి మధ్య సాగింది. పేజీల పేజీల ఉత్తరాలు ఆత్మీయంగా, అతరంగికంగా రాసేవారు. నేనూ అలాగే సమాధానాలు రాసేవాడిని. నా "చీకటిలో చీలికలు" నవల వారికి పంపాను. చదివి, చాలా రోజుల తర్వాత విపులంగా ఉత్తరం రాశారు 'మీ నవల నాకు ఉత్సాహాన్నీ, జీవితం మీద ఆశనీ కలిగించింది" అంటూ. అయితే మా మధ్య స్నేహం బలపడిందేకాని 'వసుబాలరెడ్డి' మూలన పడింది. కారణం ఆ తర్వాత రెడ్డిగారు సినిమా నిర్మించలేదు.

మరొక పక్క నా యితర రచనా వ్యాసంగం సాగుతూనే ఉంది. పరకీయ, చలిచీమ వంటి కథలు, వ్యాసాల రచన సాగుతూనే ఉంది. ప్రతీ సంవత్సరం విధిగా నన్ను తమ ప్రత్యేక సంచికలకి రచనలు చెయ్యమని యువ, జ్యోతి, ఆంధ్రజ్యోతి పత్రికల నుంచి ఉత్తరాలు వచ్చేవి. నేను రాసిన చాలా కథలు యిలా ప్రత్యేక సంచికలకి రాసినవే. పిలకా గణపతి శాస్త్రిగారు 'భారతి' చూసేవారు. భారతిలో రచన పడడం ఎమ్మే డిగ్రీ వచ్చినంత ఆనందం. శాస్త్రిగారు నాకు ఉత్తరం రాశారు. "మీ 'కోరికలాంటి చీకటి' నాటికని 'చీకటిలాంటి కోరిక'గా భారతిలో ప్రచురిస్తున్నామని." ఆ విధంగా ఆ రచన శీర్షికని కవితాత్మకం చేశారు పిలకా.

చిత్తూరులో జరిగే ప్రతీ ప్రదర్శనకీ ముందు సీటులో ఉండేవారు జిల్లా కలెక్టరు బి.కె.రావుగారు. ఆయన చిత్తూరు వచ్చిన కొత్తలో నన్ను రామస్వామి అయ్యంగార్ పరిచయ చేసినప్పుడు 'మీరీసారి నాటిక వేసినప్పుడు చెప్పండి' అన్నారు.

"ఎందుకూ, మీ కోసమే నాటిక వేయిస్తాను" అన్నారు రామస్వామి అయ్యంగార్. ఆ విధంగా రామవిలాస సభలో 'అనంతం' ప్రదర్శించాం. నాగయ్య నట జీవితానికి ఆటపట్టయిన రామవిలాస సభలో 'అనంతం' నాటికని ప్రదర్శించడం గొప్ప అనుభూతి. అప్పటి నుంచీ నా మనమల కాలం వరకూ నాకు హితులుగా నిలిచిపోయారు రావుగారు. ఆయనకు నా పెళ్ళి తెలుసు, నా పిల్లలు పుట్టడం తెలుసు, నా ఉద్యోగాలు తెలుసు, నిజానికి నేను సినిమా రంగంలో స్థిరపడడానికి ఊతం ఆయనదే. అది ముందు కథ. చిత్తూరు ఆర్ట్ లవర్స్ యూనియన్ నాటక పోటీలు నిర్వహించారు. అందులో 'అనంతం' ఉత్తమ ప్రదర్శన. నేను ద్వితీయ ఉత్తమ నటుడు. ఓ అనంతం ప్రదర్శనకి అప్పటి లోక్‌సభ స్పీకర్ అనంతశయనం అయ్యంగార్ ముఖ్య అతిథి. మా బృందంలో పోలీసు వేషం వేసిన మోహన్ దాసుగారు మా కార్యదర్శి. ముఖ్య అతిథి కోసం మోహన్‌దాసుగారు పోలీసు వేషంలోనే బయట నిలబడ్డారు. అనంతశయనం అయ్యంగార్ రాగానే మోహన్‌దాసుగారు పోలీస్ సెల్యూట్ చేశారు. ఆయన పోలీసనే అనుకున్నారు ఆయన. అయ్యంగారాయన్ని దగ్గరకి పిలిచి 'కారు తిప్పి పెట్టుకోమని డ్రైవర్‌కి చెప్పబ్బా. నువ్వు కారు దగ్గరే ఉండు' అన్నారు. మోహన్‌దాసుగారికి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థం కాలేదు. నేను పరిగెత్తుకు వెళ్ళి మోహన్‌దాసుగారిని పరిచయం చేశాను. అయ్యంగార్ నవ్వుకున్నారు – 'చెప్పవేమబ్బా' అంటూ.

చిత్తూరులో నా నాటక సమాజం పేరు 'కళావని'. తిరుపతి వేంకటేశ్వర నాటిక కళాపరిషత్తు నాటక పోటీలు సంగీత కళాశాల వేదిక మీద జరిగేవి. మేం మేకప్ అవుతూంటే ఒకాయన మమ్మల్ని వింతగా గమనిస్తూ ఎదురుగా కూర్చున్నారు. మా పని చూసి ముచ్చటపడుతూ. నిజానికి ఆయన గొప్పతనం ఆనాటికి మాకు తెలీదు. వారు ప్రఖ్యాత సంగీత విద్వాంసులు చిత్తూరు సుబ్రహ్మణ్య పిళ్ళై.

తిరుపతి రైలు స్టేషన్‌కి ఎదురుగా ఉన్న సత్రంలో మాకు బస ఏర్పాటు చేశారు పరిషత్ వారు. రిహార్సల్స్ జరుగుతూండగా శంకరంబాడి సుందరాచారిగారు వచ్చారు – 'చెప్పు మారుతీరావు – నన్నేం సహాయం చెయ్యమంటావు?' అంటూ.

'మీరు కవులు. కవి చెయ్యగల సహాయం ఒక్కటే. మా కళావనికి ప్రార్ధనా గీతం రాయండి' అన్నాను.

అక్కడికక్కడే కూర్చుని గీతం కాక, గీత పద్యం రాసి యిచ్చారు. మా నటుల్లో సంగీతం తెలిసినాయన ఒకరుండేవారు. వెంటనే శివరంజని రాగంలో ఆ పద్యాన్ని సిద్ధం చేశారు. అప్పటినుంచీ మా కళావని సంస్థ ప్రార్ధనాగీతం ఆ విధంగా స్థిరపడిపోయింది. ఆ పద్యం యిది.

మా 'కళావని' ఓంకార మర్మరాగ

మాధురుల నొంది, భావసంపదను బడసి

పల్కు గజ్జెలు కదల, విశ్వమును వశ్య

పరచుగావుత నటరాజ వందనములు

ఆ రోజుల్లో ప్రేమకి అర్ధం ఆరాధనే. మనస్సుదాకా పోకుండా ఆలోచనల్లో, intellectual స్థాయిలోనే నిలిచిపోయిన విషయం. దీనికి ముఖ్య కారణం శరత్‌బాబు రచనలూ, చలం రచనలూ. అమ్మాయి మీద ప్రేమని ఆలోచనల్లోనే పెంచేసుకుని, ఏవో కొత్త ప్రపంచాన్ని ఊహించుకుంటూ, ఊహించిన కారణంగానే పొంగిపోతూ, ఆ ఊహల్ని కాగితాల మీద వ్రాసేయాలన్న యావే తప్ప శారీరకమయిన ఆర్తికి అది ఆలంబన కావాలనే ధ్యాస లేదు.

ముద్దుకో, కావలింతకో దగ్గరయిన వ్యక్తులు నాకు గుర్తున్నారు ఆ దశలో. సందర్భాలు తెలుసు. కాని ఆ సందర్భాలు కలల్లోకి మాత్రమే మిగుల్చుకోవడమూ తెలుసు. తత్కారణంగా ఆ వ్యక్తులు నిరాశపడడం యిప్పుడు

తెలుస్తోంది. కోరిక తీరాలనే స్త్రీ ఆర్తికీ, కలలు కనాలనే రచయిత తహతహకీ పొందన లేదు. పెళ్ళయేవరకూ నా పవిత్రతని కాపాడింది నిరపాయమయిన ఈ రచయిత ఊహాలోకమే.

అయితే తప్పటడుగు పడుతుందేమోనన్న అనుమానం రాగానే మా నాన్నగారు ఆలస్యం చెయ్యలేదు. నాన్నగారు మేలుకుని ఉండకపోతే, నా జీవితాన్ని అతలాకుతలం చేసుకునేవాడిని. వాస్తవానికీ కలకూ వంతెన అవసరమని తెలియని యవ్వనం అది. ఎటు చూసినా ఊహల్ని వేడెక్కించే ప్రపంచమే కాని, నరాల్ని వేడెక్కించే యావలేదు, ప్రయత్నమూ లేదు. అసలు ఆ ఆలోచనే లేదు. "చక్కగా పెళ్ళి చేసుకుని మాకూ ఆనందమివ్వడం నీ బాధ్యత" అని నిలదీశారు నాన్నగారు. అంత నిర్దుష్టంగా ఆయన మాట్లాడడం రెండోసారి. మొదటిసారి నా ఆనర్స్ చదువులో ఆఖరి సంవత్సరంలో కనీసం డిగ్రీని నిలుపుకోవలసిన బాధ్యత నీకుందని ఆనాడు నిలదీశారు. ఈసారి వివాహం గురించి. అన్ని విషయాలలో వెసులుబాటునీ, స్వాతంత్ర్యాన్ని యిచ్చిన ఆయన రెండు కోరికలనీ బాధ్యతగా తీర్చిన తృప్తి నాకు ఉంది. ఏ ప్రేమయినా తల్లిదండ్రులతో అనుబంధాన్ని దాటి పెరగలేని స్థాయిలోనే ఉంది. నిజానికి ప్రేమ ఊతపదమే గాని దాని పేరు infatutaion. తేలికగా తల ఊపాను. ఫలితం నెలరోజులు తిరగకుండా పెళ్ళిచూపులకి వరసగా అమ్మాయిల్ని సిద్ధం చేశారు. చిత్తూరు నుంచి జీవిత భాగస్వామిని ఎంచుకోవడానికి బయలుదేరాను ఓ బస్సు, ఓ రైలూ మారి. 1961 ఆగస్టు 15న రైలు దిగాను. ఆ సాయంకాలం నా జీవితంలో మొదటి అమ్మాయిని చూశాను. ఆమె పేరు శివకామసుందరి.

శంకరాభరణం రాగంలో అన్నమాచార్య కీర్తన 'అలరులు కురియగ నాడె నదె' పాడిందా అమ్మాయి. తర్వాత నాకు చాలా యిష్టమయిన 'ఆలయమున వినపడునవిగో..” అన్న రావు బాలసరస్వతి పాట. పెళ్ళిచూపుల్లో సిగ్గుతో కుంచించుకుపోలేదు. నన్ను ఇంప్రెస్ చెయ్యాలనే యావలేదు. తన పనిని లేదా పక్కవాళ్ళకి ఉపయోగించే పనికి ఆదుకుంది. మా తమ్ముడు వొలకబోయబోతున్న కాఫీ గ్లాసు అందుకుంది. ఒక్కొక్కప్పుడు ఒక వ్యక్తి మనస్తత్వాన్ని చిన్న చిన్న అంశాలు ఆవిష్కరిస్తాయి. ఆమె అభిరుచి, తన స్థితిని పక్కకి నెట్టి అవసరంలో ఎదుటి మనిషిని ఆదుకునే మనస్తత్వం – ఇవి రెండే ఆ తక్కువ వ్యవధిలో నేను గుర్తుపట్టిన విషయాలు. ఈ రెండు గుణాలూ తరవాత్తరవాత మా వైవాహిక జీవితంలో విశ్వరూపం దాల్చాయి. అతి చిన్న వ్యవధిలో ఓ గొప్ప వ్యక్తిత్వపు విలువగా మనస్సుకి అందింది. తర్వాత నా జీవితంలో నేను వేసిన, వెయ్యబోయిన తప్పటడుగుల నుంచి ఆమె చెయ్యి ఆసరా అయి కాపాడిందో! ఆ క్షణం నా జీవితంలో అదృష్టవంతమయింది. నాలాటి turbulent, egoist కి blind, brashful వ్యక్తిని తట్టుకుని, నెట్టుకుని జీవితాన్ని నడిపించే స్నేహితురాలు దొరికిన సందర్భమది. తర్వాత మరికొందరు అమ్మాయిల్ని చూశానే కాని నా మనస్సు, అన్వేషణ ఆమె దగ్గరే ఆగిపోయింది. మరో 92 రోజుల తర్వాత నవంబరు 17న హనుమకొండలో ఒక అమృత

ఘడియలో ఆమె చెయ్యి ఆసరా నాకు దొరికింది. వరుడు వధువు పాణిగ్రహణం చేస్తాడు. కాని వాగ్గేయకారులు మైసూర్ వాసుదేవాచార్ అన్నట్టు నా పూర్వజుల పుణ్యఫలం ఆ క్షణం. ఆ క్షణంలో ఆమె నా చెయ్యి అందుకుందని నాకు తెలీదు.

అప్పటి వయస్సు, గుడ్డిగా ముందుకు దూసుకుపోయే వేడీ, పురుషాధిక్యతలాంటి అన్ని దుర్గుణాలతో పరిపూర్ణంగా దృష్టిలోపంతో ఉన్న నాకు – అది అమృత క్షణం అని గుర్తుపట్టడానికి ఓ జీవితకాలం కావలసి వచ్చింది.

## 5

రాజమండ్రిలో శ్రీపాద వారిది పెద్ద తామరతంపర. ముఖ్యంగా నాలుగు పెద్ద కుటుంబాలు – శ్రీపాద నరసింహం పంతులు. శ్రీపాద కామేశ్వరరావు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి. (నిజానికి సుబ్రహ్మణ్య శాస్త్రిగారిది పొలమూరు)

ధార్వాడ కంపెనీ – శతాబ్దపు రెండవ దశకంలో రాజమండ్రిలో నాటకాలాడి వెళ్ళాక ఆ వేదికల మీద నాటక ప్రయోగాలు చేసింది ఇద్దరు కామేశ్వరరావులని చెప్పుకుంటారు – భమిడిపాటి కామేశ్వరరావు, శ్రీపాద కామేశ్వరరావు. ఏమయినా నాటక ప్రక్రియకి విమర్శనాత్మక గ్రంథాలు రాసిన వారు ఆ దశలో ముగ్గురు కనిపిస్తారు. బందరులో పరవస్తు యజ్ఞనారాయణ శాస్త్రి, పురాణం సూరిశాస్త్రి. రాజమండ్రిలో శ్రీపాద కామేశ్వరరావు. పురాణం సూరిశాస్త్రిగారు మహా రచయిత, మహామనీషి, మల్లాది రామకృష్ణ శాస్త్రిగారికి పిల్లనిచ్చిన మామగారు. శ్రీపాద కామేశ్వరరావుగారి పెద్దబ్బాయి నాకు పిల్లనిచ్చిన మామగారు. శ్రీపాద వారంతా జ్ఞాతులు కావడంతో ఎక్కడే పురుడూ, పుణ్యం వచ్చినా అందరి ఇళ్ళల్లో అన్ని శుభకార్యాలకూ ఆటంకం రావడంతో యీ సంబంధాలు లాంఛనప్రాయంగా తెగతెంపులు చేసుకున్నారని చెప్తారు.

శ్రీపాదవారి పెద్దబ్బాయి – మా మామగారు తెలంగాణాలోనే పనిచేశారు. కరీంనగర్, భోన్ గీర్, సంగారెడ్డి, వరంగల్ ప్రాంతాల్లో విద్యాశాఖలో పనిచేస్తూ నా పెళ్ళినాటికి డి.ఈ.వోగా రిటైరయ్యారు. వారి శిష్యులు ఇద్దరి పేర్లు మాత్రం చెప్తాను – పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు. పద్మభూషణ్ సి నారాయణ రెడ్డి. రెండో కొడుకు జగన్నాథరావుగారు చక్కని చిత్రకారులు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేశారు. మూడో ఆయన శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు. తొలినాళ్ళలో కృష్ణశ్రీ అనే పేరుతో రచనలు చేశారు. చక్కని సాహితీ విమర్శకులు. మంచి వక్త. తొలిరోజుల్లో ఫిజిక్స్ డాక్టరేటు పుచ్చుకున్న వ్యక్తి. నిజాన్ని కుండబద్దలు కొట్టినట్టు విప్పి చెప్పి, సశాస్త్రీయంగా నిరూపించగల దిట్ట. ఆ దృక్పథం చదువుదీ, వృత్తిదీను. నాలుగో కొడుకు పద్మభూషణ్ శ్రీపాద పినాకపాణిగారు.

మనోధర్మ సంగీతంలో తనదైన బాణీని సృష్టించిన అపూర్వ గాయకులు, వోలేటి, నూకల చిన సత్యనారాయణ, నేదునూరి కృష్ణమూర్తి, శ్రీరంగం గోపాలరత్నం వంటి ఉద్ధండ గాయకులకు గురువు.

డాక్టర్ శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారల్లుడు వి.పి రామారావుగారు ఐ.ఏ.యస్ ఆఫీసరు. ఎన్ టి రామారావుగారి పరిపాలనలో ఛీఫ్ సెక్రటరీగా పనిచేసి పదవీ విరమణ చేశారు. మొత్తానికి పేరూ, ప్రతిష్టా గల కుటుంబాలవన్నీ. నేను కేవలం ఓ గుమాస్తా కొడుకుని. (కవి ఆర్యభట్టు కథ కేవలం 'పూర్వ ' సువాసన) సాహితీ, నాటక ప్రియత్వం వినా అప్పటికి గర్వపడే, గర్వంగా చెప్పుకునే స్థాయి నాకు లేదు. పైగా అప్పటి నా జీతం వందరూపాయలు. పెళ్ళిలో ఎంతో కొంత మా ఆవిడ తరపు వాళ్ళందరికీ చిన్న Superoority Complex ద్యోతకమయేది. ఒక విధంగా అది అసమంజసమూ, ఆక్షేపణీయమూ కాదు. అది వాస్తవం. మా మామగారు కూడా ఎవరికో నన్ను పరిచయం చేస్తూ 'ఆంధ్రప్రభలో పనిచేస్తున్నారు. త్వరలో ఆలిండియా రేడియోకి వెళ్తారు' అని చెప్పడం గుర్తుంది. ఇవన్నీ ఇప్పుడు చెప్పడానికి కారణం – కాలం ముందుకి సాగి – వారందరూ గర్వపడే స్థాయికి నా అంతస్థూ, ప్రతిష్టా పెరిగిందని చెప్పడానికి. అప్పట్లో అది నాకు గర్వాన్ని కలిగించిన  అనుభవం, అవగాహనా గర్వాన్ని 'తృప్తి'గా తర్జుమా చేసింది.

హనుమకొండలో నా పెళ్ళి. నా మిత్రులకి ప్రత్యేకమయిన శుభలేఖల మీద చేతితో చిత్రలేఖనం ఆంధ్రప్రభ ఆర్టిస్టు శ్రీరామ్మూర్తిగారితో చేయించాను. అసలు ఈ హనుమకొండ ఎక్కడ ఉంది? ఎక్కడా ఏ జాబితాలోనూ కనిపించలేదు. ఆఖరికి టెలిగ్రాఫ్ డిపార్టుమెంటు వారు చెప్పారు – హనుమకొండలేదు కాని హన్మకొండ అనే వూరు వరంగల్లు సమీపంలో ఉందని. ముస్లిం రాజ్యంలో తెలుగు భాష మడతలు పడి నలిగిపోగా మిగిలిన పదాలవి – హనుమకొండ హన్మకొండగా, భువనగిరి భోన్‌గీర్‌గా మారడం.

హనుమకొండలో అదాలత్ ఎదురుగా హంటర్ రోడ్డులో నా పెళ్ళి. దగ్గర్లో ఉన్న నక్కల గుట్టలో ఒక ఇంట్లో విడిది. ఈ రెండిళ్ళ మధ్య రెండురోజులు రిక్షాల్లో ఊరేగింపు. ఎందుకనో 'సంసారం మహాసాగరం, ఈదాలి ఏకమై ఇద్దరం' అనే పాట నా పెదాల మీద కదిలేది ఆ రెండు రోజులూ. పాటలో సాగరమే కాని మా సంసారం ఎప్పుడూ సాగరమనిపించనూలేదు, ఈది ఒడ్డున చేరాల్సిన అవసరమూ రాలేదు. పాడడం అలవాటయిన మా ఆవిడ మౌనంగా వినేది. తెల్లవారుఝామున మూడుగంటలకి ముహూర్తం. వెదుక్కుని వెదుక్కుని ఇద్దరే ఇద్దరు మిత్రులు నా పెళ్ళికి హాజరయారు. వాళ్ళిద్దరూ నవోదయా రామమోహనరావుగారు, ప్రకాశరావుగారూ. ఇద్దరూ ఓ ప్రత్యేకమయిన బహుమతి తెచ్చారు – నాకు కాదు మా ఆవిడకి. అప్పటికి ప్రచురితమయిన నా పుస్తకాలన్నీ ఎర్రటి వెల్వెట్ బైండ్ చేయించి మా ఆవిడకి బహుమతిగా యిచ్చారు. సంవత్సరాల తర్వాత వెల్వెట్ పోయింది కాని పిల్లలు పెట్టిన ఆ బైండు పిగిలిపోయినా ఓ ప్లాస్టిక్ సంచిలో ఉంది నా దగ్గర. నా పెళ్ళికి వచ్చిన మరొక వ్యక్తి కాళోజీ నారాయణరావుగారు.

**(కొనసాగింపు వచ్చే నెలలో)**

Post your comments